## క్లుప్తంగా

### చావిడి ఉత్సవం



పాదయాత్ర చేస్తున్న భక్తులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో షిర్డీసాయి బాబా చావిడి ఉత్సవం ఆదివారం నిర్వహించారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని, సాయి బాబా నామం జపిస్తూ భక్తులు చేస్తున్న ఈ పాదయాత్ర.. విజయనగరం నుంచి నక్కానపేట ఆశ్రమం వరకు 47 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి నక్కానపేటలోని బాబా ఆశ్రమానికి చేరుకుంటామని భక్తులు తెలిపారు.

### జెడ్పీటీసీ మాజీ సభ్యుడి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొంతు అప్పలనాయుడు విగ్రహాన్ని పేరాపురంలో ఆదివారం ఆవిష్కరించారు. అప్పలనాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయంగా ఆయన అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: నగరంలోని మయూరా హోటల్‌లో రచయిత జీవీ శ్రీనివాస్ రాసిన చరిత్ర చెప్పిన కథలు అనే కథా సంపుటి పుస్తకాన్ని హోటల్ అధినేత యార్లగడ్డ బాబూరావు ఆదివారం ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి నిర్వాహకులు చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత్రి, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ పూర్వ కన్వీనర్ రాణి శర్మ హాజరై, పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత గొప్పతనాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మంజరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రసంగం ఇస్తున్న రామసుబ్బారావు

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాళ్లపల్లి రామసుబ్బరావు ఆదివారం చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిల గూర్చి చెప్పిన ప్రవచనాలు ఆద్యంతం అలరించాయి. అనంతరం ఆయనను టీటీడీ భక్త భజన మండలి ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించారు.

### భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజలందుకున్న శ్రీవేంకటేశ్వరస్వామి

విజయనగరం టౌన్: ఆషాఢమాసం తొలి ఏకాదశి పురస్కరించుకుని, వైష్ణవ ఆలయాల్లో భక్తులు పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. స్థానిక శివాలయం వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు నగేషాచార్యులు, వాసుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం టీటీడీ ఆలయ ఆవరణలో కొలువైన వెంకటేశ్వరస్వామికి అర్చకులు పీవీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదిలా ఉండగా అరుంధతీనగర్‌లో కొలువైన వైభవశ్రీ వెంకటేశ్వరస్వామికి అర్చకులు రాజేష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.






# జంతు ప్రేమికా.. జాగ్రత్త సుమా!

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా కేంద్రంలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు ఆదివారం ఉచితంగా వేశారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే జూనోసిస్ వ్యాధులు రాకుండా ఈ వ్యాక్సిన్లు వేయడం జరుగుతోందని, జంతు ప్రేమికులు, సంరక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు కోరారు. మొత్తం 280 వరకు జూనోసిస్ వ్యాధులు ఉండగా, వీటిలో కుక్కల నుంచి వచ్చే ర్యాబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, దీని నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచిస్తున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ర్యాబిస్ టీకాలు వేసేందుకు జంతు సంరక్షకులు తీసుకువచ్చిన శునకాలు..వాటికి టీకాలు వేస్తున్న అధికారులను ఈ చిత్రాల్లో చూడొచ్చు









## ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

విజయనగరం టౌన్: స్థానిక బొండావీధిలోని కామాక్షి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపం వద్ద ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ అనుబంధ మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరానికి పలువురు వచ్చి, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎ.అజయ్, వేణి, అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స జన్మదిన వేడుకలు



ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఆశ్రమ వృద్ధులు, ఎమ్మెల్సీ అభిమానులు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు వృద్ధాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం, బాబామెట్టలోని ఏటీకే వెలుగు వృద్ధాశ్రమం చేరుకుని, అక్కడి వృద్ధులతో కేకు కట్ చేయించి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం వృద్ధులతో ఎమ్మెల్సీకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పించారు. ఆశ్రమానికి తమవంతుగా కొన్ని నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దవళ లక్ష్మణరావు, ఆదినారాయణ, కల్యాణం చంద్రశేఖర్, రేగాన ప్రసన్నకుమార్, సాయిహర్ష పాల్గొన్నారు.

## రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామచంద్రమూర్తి చాతుర్మాస దీక్ష ఆదివారం ప్రారంభమైంది. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం జరిపించారు. ఆ తర్వాత ఆలయంలోని వెండి మండపం వద్ద సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా చేశారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని, శ్రీరామచంద్రస్వామి వారి శయనమూర్తులకు విశ్వక్సేనారాధన చేసి చాతుర్మాస దీక్షతో పవళింపు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిరామాచార్యులు మాట్లాడుతూ ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు శ్రీమహావిష్ణువు చాతుర్మాస దీక్ష(యోగ నిద్ర)లో ఉంటారని, అదే తరహాలో రామతీర్థం రామస్వామి వారు కూడా కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలో ఉండి భక్తులను ఆశీర్వదిస్తారని తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దేవస్థానానికి తరలి వచ్చి స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

## ఆగస్టు 17న సామూహిక కనకాభిషేకం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): తిరుపతి శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవా సమాజం ఆధ్వర్యంలో ఆగస్టు 17న తిరుపతిలో 15వ సామూహిక కనకాభిషేకం మహోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు వీవీఎస్ఎస్ఎన్ గుప్త ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహం జరిగి 50 ఏళ్లు పూర్తయిన ఆర్యవైశ్య వృద్ధ దంపతులకు పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోగా తిరుపతి ఆర్యసేవా సమాజం వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 92478 66246 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘు పెద్దలు

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లిలో ఏపీ రాష్ట్ర ఎరుకుల సేవా సంఘ పెద్దలు, సభ్యులు ఏకలవ్య జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ రాష్ట్ర ఎరుకుల సేవా సంఘ ఉపాధ్యక్షుడు జి.సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు రొంగలి చినరాము, ఉత్తరాంధ్ర చైర్మన్ గేదెల లక్ష్మణ, మహిళా కార్యదర్శి దాసరి సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షురాలు డి.సంతోషి, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, యువజన అధ్యక్షుడు రమణ, జిల్లా కార్యదర్శి గేదెల అప్పారావు, ఎస్.కోట మండల శాఖ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, గేదెల పోతయ్య, దాసరి దేముడు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పెద్దబూరాడపేట, చంద్రంపేట, టెక్కలి, లక్ష్మీనారాయణపురం, తుమ్మలపేట, చిన్నబూరాడపేట, పారసాం, గెద్దపేట, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, మొయిద, నారాయణపట్నం గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని నడుపూరు, భూపాళపురం, ఆనందపురం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

**విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..**

డెంకాడ: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్, అక్కివరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు ఆదివారం తెలిపారు. ఏపీఎస్పీ బెటాలియన్, చింతలవలస పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, అక్కివరం సబ్‌స్టేషన్ పరిధిలోని బంటుపల్లి, పేడాడ గ్రామాలకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు.. ఇదే సబ్‌స్టేషన్ పరిదిలోని ఆర్.తమ్మాపురం, గంట్లాం, బెల్లాం, చినఅమకాం, అమకాం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

### సీసీ రోడ్డు నిర్మించాలి

నెల్లిమర్ల: పట్టణంలోని రామతీర్థం జంక్షన్ నుంచి రామతీర్థం వైపు వెళ్లే రోడ్డులోని రైల్వే అండర్ పాస్‌వే బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ కోరారు. ఆదివారం ఆ ప్రదేశంలో గుంతలు పడిన రోడ్డును ఆయన పరిశీలించి, మాట్లాడారు. వర్షపునీరు, మురుగునీరు ట్రాక్ దిగువన ఉండడంతో ఎప్పటికప్పుడు గుంతలు పడుతోందని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తారురోడ్డుకు బదులుగా సీసీ రోడ్డు నిర్మిస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ సమస్యలను ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులకు సమస్య వివరించాలన్నారు.

## ఆర్థిక సాయం..



రెహమాన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నేతలు

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ షేక్ రెహమాన్ శాశనపల్లి గ్రామంలో విధి నిర్వహణలో ఉంటూ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏపీఈఈయూ 1104 యూనియన్ ప్రతినిధులు 25 వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ సెక్రటరీ ఎస్.లక్ష్మణ్, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగునాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పైడిరాజు, రూరల్ బ్రాంచ్ సెక్రటరీ దేముడు, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, సెక్రటరీ అప్పారావు, సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ కార్మిక నాయకులు

విజయనగరం టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని శ్రీవిజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావులు పిలుపునిచ్చారు. నగరంలోని ఐడీఎస్ఎంటీ, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ చలానాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్లను మినహాయించాలన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నుంచి విముక్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి తద్వారా ఆటోల రుణాలివ్వాలన్నారు. ఆటో కార్మికులకు గుదిబండగా మారిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలన్నారు. జూలై 9న ప్రకాశం పార్కు నుంచి గంటస్తంభం, కన్యకపరమేశ్వరీ కోవెల మీదుగా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరకు ర్యాలీ ప్రదర్శన చేయనున్నామన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మ, కంది రాము, తర్లాడ శ్రీధర్, గేదెల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



ఐక్యత చాటుతున్న నూతన కార్యవర్గం సభ్యులు

విజయనగరం అర్బన్: జన విజ్ఞాన వేదిక నగర నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఎన్జీవో సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. నగర మహాసభలో భాగంగా జరిగిన ఈ ఎన్నిక ఏకగ్రీవం కాగా నగర కమిటీ అధ్యక్షులుగా ఎల్.చిన్నారి, గౌరవాధ్యక్షులుగా జయపాల్‌రావు, ఉపాధ్యక్షులుగా ఈపు విజయకుమార్, అప్పారావు, గణేష్, మజ్జి కాంతారావు, మీనాకుమారి, జమ్ము బంగారం, సుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా బాలరాజు, పి.వెంకటరావు, ప్రకాష్, పి.మురళీధర్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి కె.ఆదినారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

## 8న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం



పార్టీ మండల అధ్యక్షుడు సన్యాసినాయుడు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో ఈ నెల 8వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం జరుగుతుందని, దీనికన్నా ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

**వైఎస్సార్ జయంతి, నియోజకవర్గ స్థాయి సమావేశం..**

నెల్లిమర్ల రూరల్: మండలంలో ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమంతో పాటు అదేరోజు డెంకాడ మండలంలోని పినతాడివాడ గ్రామంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండలంలోని కొండవెలగాడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇరు కార్యక్రమాలకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని ఆయన కోరారు.

## విస్తృత స్థాయి సమావేశానికి తరలిరండి

● మాజీ ఎమ్మెల్యే బొత్స



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని బెల్లాన ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, తదితరులు హాజరవుతారన్నారు. ఐదు మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, మండల నాయకుడు బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు

**విజయవంతం చేయండి**

వేపాడ: నియోజకవర్గ కేంద్రమైన శృంగవరపుకోటలో మంగళవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. మండంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్‌లు, నాయకులు హాజరుకావాలని కోరారు.

## శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



గజపతినగరం: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: జనసంఘ్ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి, దివంగత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని మండల కేంద్రంలోని ఓ భవనంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు డి.సూర్యారావు సమక్షంలో పలువురు నాయకులు శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారాది చిరంజీవి, దాశెట్టి దాశరథి, జి.బంగారునాయుడు, జ్ఞానేష్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా..**

గజపతినగరం: మండల కేంద్రంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ రెడ్డి పావని, తదితరులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్, దొగ్గ దేవుడుబాబు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.